## టీబీజీకేఎస్ నాయకుడికి పరామర్శ



టీబీజీకేఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, మార్చి 30 : టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు అనుముల సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం పరామర్శించారు. కొద్ది రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఆయన, బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, వెంకటరమణ, బడికెల రమేశ్ ఉన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చెన్నూర్ రూరల్, మార్చి 30 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చెన్నూర్ ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణ మూర్తి అన్నారు. పట్టణంలోని ఎస్‌జీవీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల 25వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కరస్పాండెంట్ చల్ల సుధాకర్ రెడ్డి, న్యూ లయోలా, చాణక్య కళాశాలల ప్రిన్సిపాళ్లు పుప్పాల ప్రవీన్, సుదర్శన్ రెడ్డి, మంచిర్యాల జిల్లా మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు.. చెట్టు నీడన పశువులు



చెట్టు నీడలో సేదతీరుతున్న పశువులు

కెరమెరి, మార్చి 30 : మండుతున్న ఎండలకు ప్రజలతో పాటు పశువులు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటికి వెళ్లేందుకు సాహసించడం లేదు. అత్యవసర పనులుంటే తప్ప ఇంట్లోనే ఉంటున్నారు. ఇక మూగజీవుల పరిస్థితి దయనీయంగా మారింది. మధ్యాహ్నం 12 దాటితే పశువులు చెట్ల కింద చేరి సేదతీరుతున్నాయి. ఆదివారం ఎండ తీవ్రతకు తట్టుకోలేక కొన్ని పశువులు ఇలా చింత చెట్టును ఆశ్రయించి ఉపశమనం పొందాయి.

## హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



ఇందారంఖని ఓసీపై సమ్మెలో పాల్గొన్న వోల్వో డ్రైవర్లు

జైపూర్, మార్చి 30 : చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఇందారంఖని ఓపెన్‌కాస్టు గని వరాహ కంపెనీలో పని చేస్తున్న వోల్వో డ్రైవర్లు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారంఖని ఓపెన్‌కాస్టు గని వరాహ కంపెనీ వోల్వో డ్రైవర్లు ఆదివారం నుంచి విధులు భహిష్కరించి శాంతియుత సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యపై 5వ తేదీన కంపెనీ యాజమాన్యానికి వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇప్పటికి అనేకమార్లు విన్నవించుకున్నా కంపెనీ యాజమాన్యం స్పందించడం లేదని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ ఇబ్బందవుతున్నదన్నారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు అబ్దుల్లా



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు అబ్దుల్లా

దండేపల్లి, మార్చి 30 : దండేపల్లి మండలం మాకులపేట జీపీ పరిధి రాముగూడలోని గిరిజనులు పోడు చేసుకొని సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్‌కే అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం ఆ గ్రామంలో పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, విద్యుత్, మంచినీటి వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అర్హత ఉన్న పేదలకు పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆదివాసీ గిరిజన సంఘం జెండాను కోట్నాక సుజాత ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారం కోసం చలో తహసీల్ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొమ్రం లక్ష్మణ్, అంబటి లక్ష్మణ్, జలపతి, దీపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు కృషి

- ష్యూర్ ఎన్జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 30 : బాలల హక్కుల పరిరక్షణ కోస కృషిచేస్తామని ష్యూర్ ఎన్జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికపై అత్యాచారం కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన మాట్లాడుతూ.. ఈ కేసులో బాలికకు అన్యాయం జరిగేలా హై కోర్టు తీర్పు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అందుకు వ్యతిరేకంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్‌సీ) ఎన్జీవో సుప్రీం కోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌ను సుప్రీం కోర్టు స్వీకరించి, హైకోర్టు తీర్పుపై స్టే విధించి బాలిక తరపున వాదించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడైనా బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా, వారికి అన్యాయం జరుగకుండా ఎన్జీవోలు కృషిచేస్తాయని ఆయన తెలిపారు.



మందమర్రి : ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు



జైపూర్ : వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని వింటున్న భక్తులు



దండేపల్లి : గూడెం ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

# ఘనంగా ఉగాది వేడుకలు

*శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను జిల్లాలో ప్రజలు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇంట్లో షడ్రుచుల ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసి, ఆరగించారు. విశ్వబ్రాహ్మణులు తమ ఇళ్లలో మహమ్మాయి అమ్మవారికి పూజలు చేశారు. చిన్నారులకు మెడలో కుడుకలతో తయారుచేసిన దండలు వేశారు. ముఖ్యంగా రైతులు తమ పశువులతో పంట చేలకు వెళ్లి, భూమికి, వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు. వ్యవసాయ పనులు ప్రారంభించారు. నేటి నుంచి పనులు ప్రారంభమైనట్లుగా భావించి రైతులంతా ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే కలుగాలని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.*

**- నమస్తే నెట్‌వర్క్, మార్చి 30**

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి తన నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మంచిర్యాలలోని తమ నివాసంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలతో వేడుకలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రామాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సాయిబాబా, మార్కెట్ ఏరియాలో గల శ్రీ విశ్వనాథ స్వామి దేవస్థానం, పాత మంచిర్యాలలోని సాయిబాబా ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు-రాజకుమారి దంపతులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు-ఉదయ శ్రీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి నివాసంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు దివాకర్‌రావుకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మార్కెట్ ఏరియా చౌరస్తాలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బూరెలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మార్కండేయులు, కోశాధికారి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఇక్కడ బీఆర్ఎస్ యూత్ పట్టణాధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్, నాయకులు కాంపల్లి రాజన్న, ఆసాది మధు, గుమ్మడి కృష్ణంరాజు, వీరబోయిన సందీప్‌యాదవ్, ఆకుల సాయి పాల్గొన్నారు. వాసవీ క్లబ్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద అప్పల శ్యాం ప్రణీత్ శర్మ పంచాగ శ్రవణం చేశారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, కాల్‌టెక్స్, బజార్ ఏరియాలలో నిరుపేదలకు భోజనం అందించారు. దండేపల్లి మండల కేంద్రం, మామిడిపెల్లి, చింతపెల్లి రామాంజనేయ ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు. గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు దీరారు. 950 మంది హనుమాన్ దీక్ష స్వీకరించారు. మందమర్రి పట్టణం పాలచెట్టు ఏరియాలోని పంచముఖి ఆలయంలో ఏరియా జీఎం జీ దేవేందర్, స్వరూపారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే మార్కెట్, పాతబస్టాండ్, యాపల్, అంగడిబజార్, పాలచెట్టు ఏరియాల్లోని జనసందడి కనిపించింది. పాతబస్టాండ్ ఏరియాలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, సింగరేణి పాఠశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కెరమెరి మండలంలో ఆదివాసులు తమ ఆచారాల ప్రకారం ఎడ్లను శుభ్రంగా కడిగి కొమ్ములకు రంగులు పూశారు. అనంతరం పూజా సామగ్రితో చేనుకు వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాన్ని ఎడ్లకు తినిపించి, సహపంక్తి భోజనం చేశారు. మరో వైపు సేవాలాల్ దీక్ష తీసుకున్న భక్తులు శంకర్‌లొద్దికి వెళ్లి, శివలింగం వద్ద ప్రత్యేక పూజలతో అన్నదానం చేశారు. శ్రీరాంపూర్ ఆర్కే 5గని సమీప శివాలయంలో పూజారులు రవీంద్రశర్మ, హరీశ్ శర్మ, వినోద్‌శర్మ, రవీంద్రచార్యుల శివ కళ్యాణం నిర్వహించారు. ఆలయ ఆర్గనైజర్లు బాపూజీ, దిలీప్, అభిమన్యూ, శ్రీనివాస్, శివప్రసాద్, సురేశ్, అశోక్, వినీత్, సాయి, రాకేశ్, వెంకటేశ్, రాజబాబు ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. అన్నదానం నిర్వహించారు. కౌటాల మండల కేంద్రంలోని శివాలయంలో ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్, మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. తాండూర్ మండలంలోని వివిధ ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో.., కోటపల్లి హనుమాన్ మందిర్‌లో.., దహెగాం మండలంలోని ఆయా ఆలయాల్లో.., వేమనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆలయాల్లో.., చెన్నూర్ మండలం కొమ్మెర, బీరెల్లి, సోమన్‌పల్లి, కిష్టంపేట, ఆస్నాద్, పొన్నారం, ఒత్కులపల్లి, రచ్చపల్లి, పొక్కూర్ గ్రామాల్లోని ఆలయాల్లో.., జైపూర్ వేంకటేశ్వర ఆలయం, ఇందారం వేణగోపాలస్వామి, వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయం, షెట్‌పల్లి రామాలయాల్లో.., నెన్నెల మండలంలో.., భీమారం మండల కేంద్రంలోని కోదాండరామ, హనుమాన్, పోతపల్లి హనుమాన్ ఆలయాల్లో అర్చకులు ప్రవీణ్, పవన్, శ్రీనివాస్‌లు పంచాంగ శ్రవణం నిర్వహించారు. చింతలమానేపల్లి మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. కర్జెల్లి ఓంకార ఆశ్రమంలో ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ పూజలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర(బృందావన్)కు చెందిన శివరామ స్వామి పాల్గొన్నారు. అన్నదానం చేపట్టారు. అలాగే కన్నెపల్లి, సిర్పూర్(యూ), చెన్నూర్, రామకృష్ణాపూర్, జన్నారం మండలాల్లో వేడుకలు నిర్వహించారు.



కౌటాల : వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతులు

## అలరించిన ఉత్సవాలు

మందమర్రి, మార్చి 30 : మందమర్రి పట్టణంలోని మంజునాథ గార్డెన్స్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిఖర ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది ఉత్సవ వేడుకలు నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలుగు ప్రజలు నూతన సంవత్సరంగా ఉగాది పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని సత్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన, రంగస్థల పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిఖర ఆర్ట్స్ అధినేత అంతడుపుల నాగరాజు అధ్యక్షత వహించగా, ఉప్పులేటి నరేశ్ ఆధ్వర్యంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు డింగిరి కృష్ణచైతన్య పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయితలు దరిపెల్లి స్వరూప, అల్లాడి శ్రీనివాస్, డాక్టర్ సుమన చైతన్య కవిత్వాలను వినిపించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు దాగం మల్లేశ్, దేవి భూమయ్య, జేఏసీ కన్వీనర్ పోలు శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, లయన్ మద్ది వేణుగోపాల్, సామాజిక సేవకులు దేవర వినోద, సెగ్గం రాజలింగు, రేగుంట చంద్రకళ, పిల్లి రవి, అల్లాడి శ్రీనివాస్‌కు పురష్కారాలు ప్రధానం చేశారు. పట్టణ ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ శ్రీనివాస్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, మాజీ కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సకినాల శంకర్, సీనియర్ కళాకారులు సాదనవేణి ప్రభాకర్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, రాకం సంతోష్, ఉప్పులేటి గోపిక, అంతడ్పుల మధు, సమిండ్ల లక్ష్మి, తోకల నిరోశ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న వారితో నిర్వాహకులు, కళాకారులు

## వాటర్ ట్యాంక్ కోసం పాఠశాల భవనం కూల్చివేత

### మరోచోట నిర్మించాలని కోరుతున్న ప్రజలు



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని కూల్చి వేస్తున్న కూలీలు

చెన్నూర్, మార్చి 30 : తాగునీటి సరఫరా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం అధికారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని కూల్చివేస్తున్నారు. అమృత్ పథకం ద్వారా చెన్నూర్ పట్టణానికి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో ఒకటి నిర్మించనున్నారు. అయితే దాని నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించాలని అధికారులు భావించారు. ఇందుకు శిథిలావస్థకు చేరి నిరపయోగంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని అధికారులు కూల్చివేస్తున్నారు. కాగా, పాఠశాల ఆవరణలో కాకుండా మరోచోట ట్యాంక్ నిర్మిస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పాఠశాల ఆవరణలోని స్థలం విద్యార్థుల క్రీడలకు, పట్టణ ప్రజల వాకింగ్, వ్యాయామం లాంటి వాటికి ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. ట్యాంకు నిర్మాణం వల్ల విద్యార్థులు, ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

## పశువుల సంచారం.. ప్రమాదకరం

### మున్సిపల్ అధికారుల ఆదేశాలు పట్టని యజమానులు

- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- భయాందోళనలో వాహనదారులు

మందమర్రి, మార్చి 30 : మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారితో పాటు, కోల్‌బెల్ట్ రహదారిపై పశువుల సంచారంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. రాత్రీపగలు తేడాలేకుండా రోడ్లపై తిరుగుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మందమర్రి మున్సిపాలిటీ పరిధి పాతబస్టాండ్, యాపల్ ఏరియాలతో పాటు, నార్లాపూర్ అందుగులపేట సమీపంలోని నాలుగు వరసల జాతీయ రహదారి, సింగరేణి సీఈఆర్ క్లబ్, రామన్ కాలనీ, మార్కెట్, పాలచెట్టు ఏరియాల్లో కోల్‌బెల్ట్ రహదారిపై ఎప్పుడు చూసినా పశువులు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల రామన్‌కాలనీ సమీపంలో రాత్రి ఓ బైకు పశువును ఢీకొట్టడంతో పశువు అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే వాహనదారుడు తీవ్ర గాయాలతో దవాఖాన పాలయ్యాడు. అలాగే దంపతులు బైక్‌పై వెళ్తుండగా, పాతబస్టాండ్ చౌరస్తాలో పశువులు అడ్డురావడంతో తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పశువులను రోడ్లపైకి వదలొద్దని, లేకపోతే బంజరు దొడ్లకు తరలించడంతోపాటు చర్యలు తీసుకుంటామని గతంలోనే మున్సిపల్ అధికారులు యజమానులను హెచ్చరించారు. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకొని రోడ్లపైకి రాకుండా నివారించాలని కోరుతున్నారు.



మందమర్రి పాతబస్టాండ్‌లో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

## జాతర విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 30 : రెబ్బెన మండలం ఇందిరా నగర్‌లో కనక దుర్గా దేవి స్వయంభూ శ్రీ మహంకాళి దేవస్థానంలో ఏప్రిల్ 12, 13వ తేదీల్లో జరిగే మహంకాళి అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో సంబంధిత పోస్టర్‌ను ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, కమిటీ సభ్యులు సంతోష్, శ్రీకర్ తదితరులు ఉన్నారు.

## శ్రామికవర్గ సంస్కృతిని ఆచరించాలి

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 30 : మహాత్మా జ్యోతీబా పూలే అందించిన శ్రామికవర్గ సంస్కృతిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాల ప్రజలంతా ఆచరించాలని పూలే ఉగాది సంబురాల వేడుకల్లో వక్తలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల హక్కుల కోసం 150 ఏళ్ల క్రితం పూలే స్థాపించిన సత్య శోధక సమాజ ఉద్యమ స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేశం, చలమల్ల అంజయ్య, శ్రీరామోజు కొండయ్య, మోతే రామదాసు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, మార్చి 30 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డుకు చెందిన జింక దుర్గయ్య (71) ఈ నెల 28న పురుగుల మందు తాగగా, ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పట్టణ ఏఎస్ఐ సత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గయ్య అతిగా మద్యానికి బానిసవగా, లివర్ పూర్తిగా చెడిపోయిందని వైద్యులు చెప్పారు. అయినాభార్య సమ్మక్క ఎంత చెప్పినా వినకుండా మద్యం తాగేవాడు. ఈ నెల 28న ఇంట్లో ఎవరు లేని సమయంలో మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో దుర్గయ్య ఆదివారం మృతి చెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు



పట్టుబడిన ట్రాక్టర్‌తో అటవీశాఖ అధికారులు

భీమారం, మార్చి 30 : భీమారం మండలం గొల్లవాగు సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజర్ సుధాకర్ తెలిపారు. డ్రైవర్ జీవన్‌ను విచారించగా, మండల కేంద్రానికి చెందిన పోటు భాస్కర్‌రెడ్డి తీసుకు రమ్మన్నట్లు చెప్పాడు. దీంతో అతడిపై అటవీ చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు రేంజర్ తెలిపారు. ఎఫ్‌బీవో భానేష్, శివకుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాగులో గల్లంతై యువకుడు మృతి

కెరమెరి, మార్చి 30 : మండలంలోని శంకర్ లొద్ది వాగులో ఆదివారం ఓ యువకుడు గల్లంతై, మృతిచెందిట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్(18) శంకర్ లొద్ది వాగులో ఈత కొట్టేందుకు డైకొట్టగా, గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన ఓ వ్యక్తి పక్కనే పూజా కార్యక్రమంలో ఉన్న సేవాలాల్ భక్తులకు చెప్పాడు. వెంటనే కొంతమంది వాగులో దిగి యువకుడిని బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 30 : ముస్లింలు రంజాన్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాపై నిఘా పెట్టి, అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ముస్లింలకు ఇఫ్తార్

మంచిర్యాల అర్బన్, మార్చి 30 : మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డులో మోమిన్‌పుర్ మసీదు ఖాయారునిసాలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ వారికి పండ్లు తినిపించి, దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, సోదరులు, నాయకులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు

మందమర్రి, మార్చి 30 : యోగాతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని యోగా అధ్యాపకులు అన్నారు. సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా అధ్యాపకులు, శిక్షకులు పతంజలి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రీమ్ యోగా సొసైటీ వ్యవస్థాపకుడు శంకర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మద్ది శంకర్ సారథ్యంలో 108 సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా అధ్యాపకులు, శిక్షకులు పాల్గొన్నారు.

## గురుకులానికి విద్యార్థుల ఎంపిక

జన్నారం, మార్చి 30 : మండలంలోని పొనకల్ పంచాయతీ పరిధి అక్కపెల్లిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాల్గోతరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మైనార్టీ గురుకులానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్‌రావు తెలిపారు. ముత్యం నిహార్‌వర్మ(504), జహన్‌ఖాన్(1642) ర్యాంకులు సాధించగా, స్పెషల్ కోటాలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్య అభ్యసించనున్నట్లు పేర్కొన్నారు. వీరిని ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## భూమిని రక్షించాల్సిన బాధ్యత మనదే

హాజీపూర్, మార్చి 30 : రసాయన ఎరువుల బారినుంచి భూమిని కాపాడి సేంద్రియం వైపు దృష్టిపెట్టాలని తెలంగాణ గ్రామ వికాస్ ప్రాంత ప్రముఖ్ జిన్నా సత్యానారాయణ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో గ్రామ వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన భూమి సుపోషన్ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణతో కలిసి మాట్లాడారు. పంటలకు రసాయన మందులు వాడకుండా భూసారం, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతులదేనన్నారు. జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యవాహ కృష భాస్కర్, జిల్లా సంయోజక్ బొలిశెట్టి తిరుపతి, సహసామ్యోజక్ వెంబడి కిషన్, గ్రామ వికాస్ జిల్లా సభ్యులు దుర్గం బక్కయ్య, కటుకూరి తిరుపతి, మండల సంయోజక్ లగిశెట్టి వెంకట్, సేంద్రియ రైతులు మారు వెంకట్ రెడ్డి, నల్ల శంకరయ్య, భోగ నందయ్య, మెండు పర్వతాలు, బింగి రామయ్య, బింగి లచ్చయ్య, లగిశెట్టి లక్ష్మయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొలవార్‌లుగా గుర్తించాలి

కన్నెపల్లి, మార్చి 30 : మన్నెవార్‌లను కొలవార్ కులస్తులుగా గుర్తించాలని ఆదివాసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు కొడిపె వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ముందుగా మండల కేంద్రంలోని కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేశారు. గతేడాది నుంచి మన్నెవార్‌లకు కులం సర్టిఫికెట్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు